TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 17, గురువారం, సెప్టెంబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 131 తెలుగువారి పత్రిక..... మీ కోసం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ మంజీరా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

తెలంగాణ మంజీరా

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

98496 38320

ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

- భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్
- తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

- సీఎం చంద్రబాబు

కన్నడ లెజెండ్ యాక్టర్ అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

నీ కుంభకోణాలన్నీ బయటకొస్తాయని సభ నుంచి సస్పెండ్ చేసింది నువ్వు కదా రేవంత్..? : హరీశ్ రావు

మిగతా 2 లో

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి

కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ

30 రోజుల్లో నివేదిక

2 లో

రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన

- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ
- నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన
- కల్వకుంట్ల కుటుంబానికి 439 ఎకరాలు ఉన్నాయని వెల్లడి

ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

- ఈ ఏడాది అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు లక్ష్యం
- ఆయిల్‌పామ్‌కు ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు
- ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర
- ఉద్యాన రంగ అభివృద్ధికి రూ.1,000 కోట్లతో కార్యాచరణ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

2 లో

ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ

హైదరాబాద్, సెప్టెంబర్ 16(తెలంగాణ మంజీరా):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ - గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

రెండు రోజుల నష్టాలకుబ్రేక్ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం కోలుకున్నాయి. వరుసగా రెండు రోజుల

నష్టాల తర్వాత సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ , రియల్టీ , ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయానికి ముందు చమురు ధరలు తగ్గడం కూడా మదుపర్ల సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్ 332.63 పాయింట్లు లాభపడి 74,336.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు పెరిగి 23,217.60 వద్ద స్థిరపడింది.

మిగతా 2 లో

యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(తెలంగాణ మంజీరా)

యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

రెండు రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో స్టాక్ మార్కెట్లు

నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఐటీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. అయితే మార్కెట్‌లో మొత్తం కొనుగోళ్ల జోరు కనిపించలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం స్వల్పంగా తగ్గింది. స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం నష్టపోయింది. రంగాల వారీగా ఎఫ్‌ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ సూచీలు లాభాల్లో ముందున్నాయి. ఐటీ, ఫార్మా సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీకి 23,300–23,400 స్థాయిలో నిరోధం ఉందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 23,500 పైన నిలకడగా ఉంటే సూచీ పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దిగువన 23,100–23,070 స్థాయిని కీలక మద్దతుగా చూస్తున్నారు. 23,070 కిందకు పడితే అమ్మకాల ఒత్తిడి పెరిగి 23,000–22,800 స్థాయులకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇక అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయంపైనే మదుపర్ల దృష్టి ఉంది. వడ్డీ రేట్లపై ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లలో నగదు లభ్యత, పెట్టుబడుల ప్రవాహం, సమీపకాల మార్కెట్ దిశను ప్రభావితం చేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు.

కన్నడ లెజెండ్ యాక్టర్ అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

ప్రముఖ నటుడుబహుముఖ ప్రజ్ఞాశాలి అనంత్ నాగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించింది. 2024 సంవత్సరానికిగాను భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారికంగా వెల్లడించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని కెవాడియాలో జరగనున్న 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా అనంత్ నాగ్‌కు అభినందనలు తెలిపారు. అద్భుతమైన నటన, వైవిధ్యమైన పాత్రలతో, ముఖ్యంగా కన్నడ చిత్రసీమలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ గౌరవానికి ఆయన అన్ని విధాలా అర్హులని ప్రధాని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 4న జన్మించిన అనంత్ నాగ్) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతోపాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపైనే కాకుండా ఆర్కే నారాయణ్ కథల ఆధారంగా దూరదర్శన్‌లో ప్రసారమైన 'మాల్గుడి డేస్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన నటనకుగాను ఐదుసార్లు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు అందుకున్న అనంత్ నాగ్‌ను గత ఏడాది భారత ప్రభుత్వం దేశంలోని మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు ఆయన చేస్తున్న సేవలకు ఫాల్కే అవార్డు సరైన గౌరవమని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

నీ కుంభకోణాలన్నీ బయటకొస్తాయని సభ నుంచి సస్పెండ్ చేసింది నువ్వు కదా రేవంత్..? : హరీశ్ రావు

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొత్తం రేవంత్ రెడ్డి అబద్ధాలు, అర్థ సత్యాలు చెప్పి ఒక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని ఆరోపించారు. ఆయన మాట్లాడినవన్నీ కూడా పచ్చి అబద్ధాలు.. మా రాహుల్ గాంధీ టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకొని లోక్ సభకు పోయారు. లోక్ సభ నియమ నిబంధనలువేరు.. అసెంబ్లీ నియమ నిబంధనలు వేరు. అంటే మీ రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు టీ షర్ట్ వేసుకొని పోతే ఒప్పు.. అదే బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ షర్ట్ వేసుకొని అసెంబ్లీకి వస్తే తప్పు అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. కొన్ని రూల్స్ ఉంటాయి.. రాజ్యాంగం ఉంటది.. కొన్ని సంప్రదాయాలు ఉంటాయంటడు. అసలు అసెంబ్లీలు ఏ సంప్రదాయాలు పాటిస్తాయి.. లోక్ సభలో పాటించే సంప్రదాయాలే సాధారణంగా అసెంబ్లీలు కూడా పాటిస్తుంటాయి. లోక్‌సభలో రాహుల్ గాంధీ టీ షర్ట్‌లు, స్టిక్కర్లు వేసుకోవచ్చని రాహుల్ గాంధీ రేవంత్‌రెడ్డిని సమర్థిస్తడు. బీఆర్ఎస్ వేస్తే తప్పు.. బీఆర్ఎస్ ఏమైనా టీ షర్ట్ మీద బూతు పదం రాసుకొని వచ్చిందా..? ఏమైనా నిషేధించిన పదాలు రాసుకొచ్చిందా అని ప్రశ్నించారు. నీ ఆరు గ్యారంటీల అమలులో నువ్వు విఫలం అని రాసింది నిజం కాదా..? అవ్వాతాతలు రూ.4 వేలు ఎగ్గొట్టింది నిజం.. మహిళలకు రూ.2500 ఎగ్గొట్టింది నిజం. విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వంది నిజం అని రాసుకొస్తే అదేదో బూతు పదం,నిషేధితపదమని మమ్మల్ని సస్పెండ్ చేసినవ్. వీళ్లు కావాలనే అసెంబ్లీ నుంచి పోయిర్రు అని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడుతడు.. మేం పోలేదు అసెంబ్లీ నుంచి.. పథకం ప్రకారం నువ్వు పంపించినవ్.. మా సోదరీమణులు, శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి గొంగు పిసికారు.. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారు.. దాని మీద ఎంక్వైరీ చేయండి.. క్షమాపణ చెప్పండి.. లేదా మాట్లాడటానికి మైక్ ఇవ్వండి సబితక్కకు అని 10 సార్లు స్పీకర్‌ను అడిగాం. నిండు శాసనసభ సాక్షిగా గేటు ముందే మహిళా ఎమ్మెల్యేల మీద హత్యాయత్నం జరుగుతుంటే మైకు కూడా ఇవ్వలేదన్నారు. మేం సభలో ఉంటే మీ బండారాన్ని బయటపెడతామని.. మీ కుంభకోణాలన్నీ బయటకు వస్తాయని, నీ తమ్ముడి కుంభకోణాలు బయటపెడతామని, నీ కుటుంబ కుంభకోణాలన్నీ బయటకొస్తాయని సభ నుంచి సస్పెండ్ చేసింది నువ్వు కదా..? అని ప్రశ్నించారు. సస్పెండ్ చేస్తే ఒక్క రోజు చేయొచ్చు కదా.. మొత్తం సెషన్‌కు ఎందుకు చేసినవ్ అని ప్రశ్నించారు.

ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

తిరుమల, సెప్టెంబరు 16 (తెలంగాణ మంజీరా):

తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు. తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులుతిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ–మోబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం పెద్దపీట

హైదరాబాద్, సెప్టెంబర్ 16(తెలంగాణ మంజీరా):

రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం శాసనసభలో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పథకాల కింద అదనంగా 2 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటల వైపు రైతులను మళ్లించేందుకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉద్యాన పంటల సాగు విస్తరణకు అవసరమైన మొక్కలు, ఎరువులు, మల్చింగ్, షేడ్‌నెట్, ఫామ్‌పాండ్లు, శీతల గిడ్డంగులు, శాశ్వత పందిళ్లు, బిందు, తుంపర సేద్యం వంటి సదుపాయాలను నిబంధనల ప్రకారం 40 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీపై అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. 2026--27లో మొక్కలు, మల్చింగ్, షేడ్‌నెట్, కోత అనంతర నిర్వహణ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, ఉద్యాన యాంత్రీకరణ, శాశ్వత పందిళ్ల కోసం రూ.150 కోట్లు, బిందు, తుంపర సేద్యం కోసం రూ.243 కోట్లు, ఆయిల్‌పామ్ అభివృద్ధికి రూ.261 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88,282 మంది రైతులు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. టీవీజూ–ఝా పథకం కింద 2021--22 నుంచి ఇప్పటివరకు 2.74 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి 1.37 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించామని చెప్పారు. 2026--27 సంవత్సరానికి 85 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 29,053 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. సాంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పంటల వైవిధ్యీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ పంటను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు మొక్కలు, డ్రిప్, మొదటి నాలుగేళ్లకు ఎరువులు, అంతర పంటల సాగు తదితరాలకు కలిపి ఎకరానికి రూ.46,250 వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఫామ్‌పాండ్లు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ చట్టం--1993 ప్రకారం ఫ్యాక్టరీ జోన్ కేటాయించిన ప్రతి ఆయిల్‌పామ్ కంపెనీ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రతి నెలా ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.24,025 ధర ఉందన్నారు. కనీస హామీ ధర (వీ+ూ) ప్రకటించాల్సింది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, అయినప్పటికీ రైతులకు మరింత భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని వీ+ూ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, అప్పారావుపేట, నర్మెట్టలో, గోద్రెజ్ ఆధ్వర్యంలో అంజనాపురంలో మిల్లులు పనిచేస్తున్నాయని చెప్పారు. మరో ఆరు మిల్లుల నిర్మాణ పనులు కల్లూరుగూడెం, ఇంచెర్ల, పెద్దరాతు, రేగొండ/చిన్నపాక, యాచారం, శంకరంరెడ్డిపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని, వచ్చే ఏడాదికి ఇవి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రిఫైనరీ, ఆధునిక ప్యాకేజింగ్ కేంద్రం ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. మిల్లుల ఏర్పాటుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్న ప్రాంతాల్లో ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఒక ఫ్యాక్టరీ నిరంతరాయంగా పనిచేయాలంటే కనీసం 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట హార్వెస్టింగ్ దశకు రావాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటికే పలు ఫ్యాక్టరీలకు అనుమతులు ఇచ్చి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అన్ని ఉమ్మడి జిల్లాల్లో మిల్లుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ములుగు, భూపాలపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే ఫ్యాక్టరీల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామని, జనగామ, మహబూబాబాద్ ప్రాంతాల్లో కూడా ఆయిల్‌పామ్ సాగు విస్తరిస్తున్నందున అక్కడ అదనపు ప్రాసెసింగ్ సదుపాయాల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. ఆరు నెలల్లో ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కనీసం 10--15 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరించేలా రైతులను ప్రోత్సహిస్తే అక్కడే ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. ఆయిల్‌పామ్‌కు మార్కెటింగ్ సమస్య ఉండదని మంత్రి తెలిపారు. పంట కొనుగోలు కోసం ప్రాసెసింగ్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కోతుల బెడద, అడవి జంతువుల వల్ల కలిగే ఇబ్బందులు కూడా ఆయిల్‌పామ్ సాగుతో తగ్గుతాయని చెప్పారు. ఆయిల్‌పామ్ పంట ఎగుమతులకు కూడా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీలు, చిన్నకారు రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం వరకు సబ్సిడీలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మల్చింగ్, షేడ్‌నెట్, డ్రిప్, స్ప్రింక్లర్ తదితర ఉద్యాన సదుపాయాలకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేసుకుని ఈ సంవత్సరం సుమారు రూ.1,000 కోట్లతో ఉద్యాన పంటల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఫామ్‌పాండ్ల ఏర్పాటుకు కూడా సబ్సిడీ అందిస్తున్నామని, ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఉచితంగా ఫామ్‌పాండ్లు తవ్వుకునే అవకాశం ఉందన్నారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవాలని రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్ పంట వరి తో పోలిస్తే తక్కువ నీరు అవసరమవుతుంది, మొక్క నాటిన తర్వాత సుమారు 40 సంవత్సరాల వరకు దిగుబడి అందించే అవకాశం ఉన్నందున రైతులు ఈ పంట వైపు దృష్టి సారించాలని మంత్రి కోరారు. జుక్కల్ నియోజకవర్గంలో బొప్పాయి మార్కెట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కోరిన అంశంపై మంత్రి స్పందిస్తూ, ప్రస్తుతం అక్కడ సుమారు 36 ఎకరాల్లో మాత్రమే బొప్పాయి సాగు జరుగుతున్నందున తక్షణం ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేసే అవకాశం లేదని తెలిపారు. అయితే సాగు విస్తీర్ణం పెరిగి, మార్కెట్ అవసరం ఏర్పడితే తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పోడు వ్యవసాయం చేస్తున్న రైతులను కూడా సోలార్ వ్యవస్థ వైపు మళ్లించి, భవిష్యత్తులో ఉద్యాన పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన అని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌కు సమీప ప్రాంతాల్లో పండే ఉద్యాన పంటలను ఎగుమతి చేసే అవకాశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు విస్తరణతో రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం, ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయడం, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ఉద్యాన రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ.. 30 రోజుల్లో నివేదిక:

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మరో గుడ్ న్యూస్

గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం

హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ విపి గౌతమ్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 16(తెలంగాణ మంజీరా):

తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోఅల్పదాయ వర్గాల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ సొంతింటి పథకానికి సంబంధించి 20-07-2026 తేదీన జారీ చేసిన డిమాండ్ నోటిఫికేషన్ ద్వారా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం కల్పించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాల్లో ఏదైనా ఒక నియోజకవర్గం కింద దరఖాస్తు చేసుకొని, ప్రస్తుతం కింది నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నివసిస్తున్న అభ్యర్థులు తమ పాత దరఖాస్తును ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గానికి బదిలీ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు 1. ఎల్బీ నగర్, 2. గోషామహల్, 3. ముషీరాబాద్, 4. చాంద్రాయణగుట్ట అర్హులైన అభ్యర్థులు తమ పాత దరఖాస్తు వివరాలతో తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోని కింది లింక్ ద్వారా 20-09-2026లోగా దరఖాస్తు బదిలీ కోసం అభ్యర్థించాలని శ్రీ వి.పి. గౌతమ్ సూచించారు. అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తు బదిలీ చేయబడుతుందని, ఈ బదిలీ నివాస ధ్రువీకరణతో పాటు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన అన్ని అర్హతలు, నిబంధనల పరిశీలనకు లోబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం అభ్యర్థులు కొత్తగా లేదా ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించరాదన్నారు. దరఖాస్తు బదిలీ చేయడం వల్ల ఇంటి కేటాయింపుపై ఎలాంటి హక్కు ఏర్పడదని, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ మరియు నిర్దేశించిన కేటాయింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి నగదు చెల్లించవద్దని శ్రీ వి.పి. గౌతమ్ కోరారు. అధికారిక సమాచారం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధీకృత మార్గాల ద్వారా మాత్రమే తెలియజేయబడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 040-24603572ను సంప్రదించవచ్చు.

కమిటీ హాల్ నిర్మాణానికి సహకరించండి

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం

హైదరాబాద్, సెప్టెంబర్ 16, తెలంగాణ మంజీరా:

.కమిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని పి ఎ సి చైర్మన్ గాంధీ కి వినతి పత్రం అందజేసిన ఊట్ల చంద్రా రెడ్డి. శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి జోన్, ఆల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని, పాపిరెడ్డి నగర్ లోగల శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం ఆవరణలో, కమిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలంటూ బుధవారం బస్తి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అరేకెపుడి గాంధీని కలిసి వినతి పత్రాన్ని అందిస్తూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, కె.వి.రాజు అధ్యక్షుడు ఆడెపు ప్రభాకర్ నేతలు ఆనంతరాములు, జీవి కన్నారావు. తిరుపతి రెడ్డి. పి శంకర్ రెడ్డి డి రామ్ రెడ్డి వనం ఆంజనేయులు, ఏ చంద్రశేఖర్ రెడ్డి. చంద్రయ్య ముత్యం వెంకట్ రెడ్డి , పి.శంకర్ రెడ్డి, కనకా రెడ్డి. పండు గౌడ్, శ్రీనివాస్ , సత్యనారాయణ రెడ్డి శ్రీకాంత్ భాస్కర్ గుప్తా శ్రీలత, లక్ష్మి సులోచన.తదితరులు పాల్గొన్నారు.

జపాన్ సరికొత్త రికార్డు

లక్ష దాటిన శతాధిక వృద్ధులసంఖ్య..!

జపాన్ సరికొత్త రికార్డు దక్కించుకుంది. ఆ దేశంలో శతాధిక వృద్ధుల సంఖ్య లక్ష మార్కును అధిగమించింది. అక్కడ ప్రస్తుతం 1,07,677 మంది శతాధికులు ఉన్నట్లు జపాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 15న అధికారికంగా ప్రకటించింది. వందేళ్లు పైబడిన వారి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తున్నది. ఇలా క్రమం తప్పకుండా శతాధికుల సంఖ్య పెరగడం అనేది గత 56 ఏండ్లుగా వరుసగా కొనసాగుతున్నది.ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. శతాధికుల్లో మహిళలదే అగ్రస్థానం. మొత్తం సంఖ్యలో సుమారు 88 శాతం, అంటే 94,298 మంది మహిళలే ఉన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యంత వృద్ధురాలిగా క్యోటోకు చెందిన 114 ఏళ్ల ఫుయో కిషిమోటో, అత్యంత వృద్ధుడిగా కుమామోటోకు చెందిన 112 ఏళ్ల హికారు కాటో రికార్డుల్లో నిలిచారు. జపాన్‌లో శతాధికుల సంఖ్య వృద్ధిని పరిశీలిస్తే.. 1963లో గణాంకాల సేకరణ ప్రారంభమైనప్పుడు వీరి సంఖ్య కేవలం 153 మాత్రమే ఉండేది.ఆ సంఖ్య 1981 నాటికి వెయ్యి దాటింది. 1998లో 10,000 కు, 2012లో 50,000 కు చేరింది. ఇప్పుడు ఏకంగా లక్ష మార్కును దాటి సరికొత్త రికార్డును నమోదుచేసింది. ఈ గణాంకాలపై జపాన్ ఆరోగ్య శాఖ మంత్రి కెనిచిరో యునో హర్షం వ్యక్తంచేశారు. వైద్య, సాంకేతిక రంగాల్లో సాధించిన అద్భుత ప్రగతి వల్లే ప్రజలు ఆరోగ్యకరమైన, క్రియాశీలక దీర్ఘాయుష్షును పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. జపాన్‌లో ఏటా నిర్వహించే 'రెస్పెక్ట్ ఫర్ ది ఏజ్డ్' అనే ప్రభుత్వ సెలవుదినానికి ముందు ఈ వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వందేళ్లు పూర్తి చేసుకున్న వారిని ప్రభుత్వం గౌరవించడం ఆనవాయతీగా వస్తున్నది.

సౌదీకి హుతీల మరో భారీ షాక్..!

అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(తెలంగాణ మంజీరా):

పశ్చిమాసియాలో సౌదీ అరేబియా–హుతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హుతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్–మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్థంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హుతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హుతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హుతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హుతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది.యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్–15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హుతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హుతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హుతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హుతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారాన్ని అరికట్టాలి

హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

డిజిపి హైదరాబాద్, ఎస్సీ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు

ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ డివిజన్ కన్వీనర్ బిక్షపతి

నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తక్షణమే అరికట్టి, అమరా ప్రసాద్‌తో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ డిజిపి, ఎస్సీ ఎస్టీ కమిషన్, మల్కాజిగిరి సబ్ ఇన్స్పెక్టర్ పోలీసులకు పోలీస్ ఉన్నత అధికారులకు మెమోరాండం సమర్పించింది. ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నర్సాపూర్ తాలూకా కన్వీనర్ పోతరాజు బిక్షపతి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కేవలం భారత రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా ప్రపంచ మేధావి, ప్రజాస్వామ్యవాది, ప్రజా హక్కుల పరిరక్షకుడు, మహిళా హక్కుల పరిరక్షకుడు, సామాజిక న్యాయ ఉద్యమ నేత, ఆర్థికవేత్త, తత్వవేత్తగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహనీయుడని పేర్కొన్నారు. భారత ప్రజలకు,బడుగు, బలహీన వర్గాలు, దళితులు, మహిళలు, అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం వంటి విలువలను రాజ్యాంగం ద్వారా ప్రజలకు అందించిన అంబేద్కర్ స్ఫూర్తి నేటికీ దేశానికి మార్గదర్శకంగా ఉందని తెలిపారు. ఆయన రాజ్యాంగ రచనలో పోషించిన పాత్రపై వాస్తవాలకు విరుద్ధమైన సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో అపోహలు, విద్వేషాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని నాయకులు ఆరోపించారు. హమారా ప్రసాద్ భారత రాజ్యాంగం రచించిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పట్ల పేర్కొంటున్న వ్యాఖ్యల, ప్రచారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అయితే ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయడం, ఒక వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, సోదరభావాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం డిమాండ్ చేశారు.
లేనియెడల భారత రాజ్యాంగాన్ని, అంబేద్కర్ స్ఫూర్తిని, పరిరక్షణ కోసమై పోరాటాలకు సంసిద్ధమవుతామని, ఏవైనా అవాంఛనీయ సంఘటనలకు పూర్తి బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని నాయకులు తెలిపారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సేవా సంకల్ప్ అభియాన్‌లో ప్రజాసేవా కార్యక్రమాలు

ఎంపీ రఘునందన్‌రావు

నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మెదక్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవం, సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసే ప్రక్రియలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేతృత్వంలో జరిగిన ఆపరేషన్ పోలో అనంతరం తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనమైందని తెలిపారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు తెలిపారు. ప్రజాసేవ, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యతలను 'వికసిత్ భారత్--2047' సంకల్పంతో అనుసంధానం చేయడమే సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆశీర్వాదాల దీపం, 25 కోట్ల పిల్లల కలలు, నమో సేవా గాథ, అంగన్‌వాడీ ఉత్సవాలు, మార్పు కథ, వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర, సేవా జ్యోతి యాత్ర, సేవలో నా భాగస్వామ్యం, నదీతీరాల అభివృద్ధి, సేవా సేతు అభియాన్ తదితర కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

లోధా సామాజిక వర్గం స్థితిగతుల పరిశీలన

రాష్ట్ర బీసీ కమిషన్ క్షేత్రస్థాయి విచారణ

నారాయణఖేడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :

తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఆధ్వర్యంలో లోధ్ /లోదా సామాజిక వర్గం ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, వృత్తి, జీవన పరిస్థితులను తెలుసుకునేందుకు బుధవారం సిర్గాపూర్ మండల పరిధిలోని కడప్పల్ గ్రామం రైతు వేదికలో, నిజాంపేట్ గ్రామం విచారణ నిజాంపేట్ లోని రైతు వేదిక లలో క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి సతీష్ కుమార్, లోధా సామాజిక వర్గ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ లోధా సామాజిక వర్గానికి చెందిన ప్రజలను వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలని కోరుతూ గత కొన్ని సంవత్సరాలుగా కమిషన్‌కు వినతులు అందుతున్నాయని లేదా వసతులపై తెలుసుకున్నారు. స్వాతంత్ర్యం అనంతరం, నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైన తరువాత ఈ సామాజిక వర్గానికి సంబంధించిన వివరాలు, ఆధారాలను సరైన రీతిలో సమర్పించడంలో లోపాలు ఉన్నాయన్న అంశాలను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.క్షేత్రస్థాయి విచారణలో భాగంగా లోధా సామాజిక వర్గ ప్రజల కుటుంబ పరిస్థితులు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, వృత్తులు, జీవన విధానం, పిల్లల విద్య తదితర అంశాలను నమోదు చేసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారు. విచారణ అనంతరం సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించి ప్రభుత్వానికి, సంబంధిత శాఖలకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2021 నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈ.డబ్ల్యూ.ఎస్ కోటా లో 10 శాతం రిజర్వేషన్ అమల్లో ఉందని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ లోధా సామాజిక వర్గ ప్రజలు తమ సమస్యలను, స్థితిగతులను విచారించడానికి బీసీ కమిషన్ రావడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని, లోధా సామాజిక వర్గం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకుని అర్హత మేరకు లబ్ధి పొందాలని సూచించారు. కొత్త పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తులు సమర్పించాలని, ఇందుకోసం సిబ్బంది, ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, డీఎస్పీ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో, సర్పంచ్‌లు , లోధా సామాజిక వర్గ పెద్దలు, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం..!

రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశానికి నూతన దిశ

దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర

1,500 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర పూర్తి చేసిన కాటూరి వెంకటేశ్వర్లుకు ఘన స్వాగతం

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

భారతదేశం కోసం ఎన్నో త్యాగాలు చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పాటుపడుతున్న గాంధీ కుటుంబం వారసుడు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టడం గొప్ప విషయమని ప్రతి కార్యకర్త రాహుల్ ను ప్రధాని చేసేందుకు కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. దేశ ఐక్యత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న జాతీయ పాదయాత్ర బుధవారం పటాన్‌చేరు నియోజకవర్గానికి చేరుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పాదయాత్రకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముత్తంగి పుట్టి రింగ్ రోడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ముత్తంగి డివిజన్ పరిధిలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి అభినందించారు. దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు సమాన అవకాశాలు, పేదలకు సామాజిక భద్రత, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలనే ఆలోచనలతో ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సోదరభావం, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించడం సాధారణ విషయం కాదని, ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే సంకల్పంతో ఇంత సుదీర్ఘ ప్రయాణాన్ని చేపట్టిన కాటూరి వెంకటేశ్వర్లును అభినందిస్తున్నామన్నారు. ఎండ, వర్షం, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పాదయాత్రను కొనసాగించడం గొప్ప విషయమని కొనియాడారు.దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా అధ్యక్షులు కొల్కురి నర్సింహారెడ్డి, కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, దస్తగిరి, మన్నె రాఘవేంద్ర, సంపత్ రెడ్డి, నారాయణదాసు, మణికంఠ, సందీప్ గౌడ్, మాజీ సర్పంచులు రాజి రెడ్డి, సుంకరి రవీందర్, జగన్, సీనియర్ నాయకులు ముత్తంగి అశోక్, మధు పంతులు, గడ్డ యాదయ్య, షాపురం నరసింహారెడ్డి, రుద్రారం లక్ష్మారెడ్డి , దండోరా నర్సింహ, గోపాలకృష్ణ, లక్దారం లక్ష్మ రెడ్డి, సంజీవ, సందీప్ యాదవ్, మైలారం శ్రీను, పాండు, శంకర్, ప్రకాష్ రాథోడ్, ప్రవీణ్, రంజిత్, రాజ్ గోపాల్, కాంగ్రెస్ నాయకులు శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే జగ్గారెడ్డి పని..!

బైపాస్ రోడ్డు ప్రయాణంలో ప్రజల ఇబ్బందులు

50 ఫీట్ల రోడ్డుతో ఎవ్వరికి ఉపయోగం

మాటలోద్దు... రోడ్డు, అభివృద్ధి చేయండి

ముగ్గురు సీఎంలు మారిన రాజీవ్ పార్క్ ఎందుకు బాగు చేయలేదు...?

జగ్గారెడ్డి పై మాజీ సిడిసి చైర్మన్ బుచ్చిరెడ్డి ఫైర్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి బైపాస్ రోడ్డు అభివృద్ధి విషయంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే అసలు ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నంలా కనిపిస్తున్నాయని మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి అన్నారు. బైపాస్ రోడ్డు విషయంలో మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే పై చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్ శ్రేణులు తిప్పికొట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, రామప్ప, కౌన్సిలర్ లు పొన్న రాజేందర్ రెడ్డి, శ్రీకాంత్ మీడియా తో మాట్లాడారు. వ్యక్తిగత విమర్శలు, అనవసర ఆరోపణలు కాకుండా సంగారెడ్డి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడితే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని సవాల్ చేశారు. బైపాస్ రోడ్డుపై ప్రతిరోజూ ప్రజలు పడుతున్న ఇబ్బందులు మాజీ ఎమ్మెల్యేకు తెలియదా..? గుంతలు, ట్రాఫిక్ సమస్యలు, నెమ్మదిగా సాగుతున్న పనులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైపాస్ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించాలన్నదే ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ అని పేర్కొన్నారు. 50 అడుగుల రోడ్డుతో సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందా? లేక భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 80 అడుగుల ఉన్న చోట 80. అడుగులు 60 అడుగులు ఉన్న చోట 60 అడుగుల రోడ్డును నిర్మించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలా? అనేది ప్రజలే ఆలోచించాలని కోరారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టంగా చెబుతున్నది ఒక్కటే ప్రజలకు ఉపయోగపడే విధంగా రోడ్డు నిర్మాణం జరగాలి. భవిష్యత్‌లో మళ్లీ రోడ్డు విస్తరణ అవసరం రాకుండా ఇప్పుడే సరైన ప్రణాళికతో పని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ లు ,లాడె మల్లేశం, నవీన్, సురేష్, కసిని శ్రీకాంత్, విఠల్, వజిత్ తదితరులు ఉన్నారు.

చేయూత పింఛన్ ప్రారంభం

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

గౌడిచెర్ల గ్రామంలో చేయూత పింఛన్ లబ్ధిదారుల ధృవీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి రవీందర్ గౌడ్, ధృవీకరణ అధికారి ఝాన్సీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాణిలు పాల్గొని లబ్ధిదారుల వివరాలను పరిశీలించి ధృవీకరణ చేపట్టారు. కార్యక్రమంలో సంబంధిత లబ్ధిదారులు కూడా పాల్గొన్నారు.

వినాయక మండపం సందర్శించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని 11వ వార్డు రెడ్డి కాలనీలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహిస్తున్న త్రిశూల్ యూత్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, కౌన్సిలర్ లు రాజేందర్ రెడ్డి, దశరథ్ రెడ్డి , జీవీ శ్రీనివాస్, విఠల్, శ్రవణ్ రెడ్డి, లాడే బాలు , స్థానిక నాయకులు, యువకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకునికి పూజలు

సంగారెడ్డి తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రం సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి తనుజ అపార్ట్‌మెంట్స్ నందు శ్రీ వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అపార్ట్‌మెంట్ నివాసితులు విశేష సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.?ఉదయం నుంచే ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి శాస్త్రోక్తంగా గణపతి హోమం, అభిషేకం మరియు అర్చనలు జరిపించారు. అనంతరం స్వామివారికి ప్రియమైన కుడుములు, ఉండ్రాళ్లతో మహా నైవేద్యం సమర్పించారు. ?ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ అందరి సహకారంతో ఈ పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి కృపతో అందరూ ఆయు ఆరోగ్యాలు, ఐశ్వర్యాలతో విలసిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో స్థానిక కుటుంబాలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తనూజ అపార్ట్మెంట్ సభ్యులు అందరూ వినాయక పూజలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభావతి, శ్రీనివాస్, రేణుక, కరుణాకర్ రెడ్డి, ప్రీతి, మల్లికార్జున్ రెడ్డి, లతా,కృష్ణారెడ్డి కల్పనా నాగరాజు,జోషి మహేశ్వరి సత్యనారాయణ,సుజాత, ఆంజనేయులు, రమ్య, ప్రవీణ్, ప్రవీణ్ కుమార్, సరిత విజయ్ కుమార్, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గణనాథుని సన్నిధిలో భక్తి స్వరాలు

నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భజనలు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం ఉత్సవాల్లో భాగంగా వినాయకుని సన్నిధిలో నిర్వహించిన భజన కార్యక్రమంతో పట్టణంలోని మంజీరా నగర్ భక్తిమయయంగా మారింది. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథునికి నైవేద్యం సమర్పించిన కమిటీ సభ్యులు అనంతరం భవాని భజన మండలి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో స్వామివారిని కొలిచారు. గణపతి నామస్మరణతో మార్మోగగా, భక్తులు ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా భజన కార్యక్రమంలో పాల్గొని గణనాథుని కృపకు పాత్రులయ్యారు. భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ భజన కళాకారులు శాంతి కుమార్, శ్రీశైలం, నర్సింలు, మహేష్, కమిటీ సభ్యులు మాణిక్ ప్రభు, దత్తాత్రి, సాయినాథ్, శ్రీశైలం, పెంటయ్య, సురేష్, ఆంజనేయులు, రాము, శేఖర్, రమేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనంలో విషాదం

ఆరుగురు విద్యార్థులు మృతి

పటాన్‌చెరు, తెలంగాణ మంజీరా న్యూస్:

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పెద్ద కంజర్ల గ్రామంలో గణపతి నిమజ్జనం విషాదాన్ని నింపింది. నిమజ్జనం కోసం చెరువుకు వెళ్లిన ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటన బుధవారం సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో జరిగినట్లు తెలుస్తోంది. తాజా నివేదికల ప్రకారం పెద్ద కంజర్లలోని చెరువులో ఈ ఘటన చోటుచేసుకుంది.మృతులు శిరీష హాస్టల్‌కు చెందిన విద్యార్థులుగా, ఇంటర్మీడియట్, బీటెక్ చదువుతున్న విద్యార్థులుగా సమాచారం. ఘటన అనంతరం విద్యార్థులను గ్లోబల్ ప్రాచీన్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఆరుగురు విద్యార్థుల మృతితో పెద్ద కంజర్లలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి పరిస్థితిని పరిశీలించనున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ మణికంఠ కాలనీ గల గణేష్ మండల్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మణికంఠ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్నదాతగా అంజయ్య వ్యవహరించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా 9 రోజుల పాటు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మణికంఠ అసోసియేషన్ అంజన్న కృష్ణ రామస్వామి సతీష్ మోహన్ నాయక్ దామోదర్ రెడ్డి రామలింగం రాము పంతులు తదితరులు పాల్గొన్నారు.

థింక్ గురు ఓవర్సీస్ కన్సల్టెన్సీ ప్రారంభం

విద్యార్థులకు విదేశీ విద్యపై నాణ్యమైన మార్గదర్శకత్వం అవసరం

డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణంలో థింక్ గురు ఓవర్సీస్ కన్సల్టెన్సీ నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై, సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో విదేశీ విద్యకు సంబంధించిన కన్సల్టెన్సీ సంస్థ ప్రారంభం కావడం అభినందనీయమన్నారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సరైన సమాచారం, అవసరమైన మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యా, వృత్తి లక్ష్యాలకు అనుగుణంగా సరైన కోర్సులు, విశ్వవిద్యాలయాలను ఎంచుకునేలా నిపుణుల సలహాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.థింక్ గురు ఓవర్సీస్ కన్సల్టెన్సీ ద్వారా విదేశీ విద్యకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన కన్సల్టెన్సీ సేవలు, మార్గదర్శకత్వం అందుబాటులోకి రావడం స్థానిక విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సంస్థ నిర్వాహకులు విద్యార్థులకు పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

నిర్మాణాలు కూల్చకుండా రోడ్డు వేద్దామంటే... స్థానిక ఎమ్మెల్యే అన్ని బిల్డింగ్ లు కూల్చాలంటున్నారు..?

80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాల కూల్చివేత అవసరమా..?

కోట్లలో నష్టపరిహారం చెల్లించడం సాధ్యమా..?

కూల్చివేతలు లేకుండా బైపాసద్ రోడ్డు అభివృద్ధి చేస్తాం

బై పాస్ రోడ్డులో పర్యటించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పర్యటించారు. బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి కాలినడకన రోడ్డును పరిశీలించారు. బైపాస్ రోడ్డుపై ప్రస్తుతం ఉన్న రహదారి విస్తీర్ణాన్ని మూలమూలన అధికారులతో కొలతలు తీయించారు. రోడ్డు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి రోడ్డు పనులు చేస్తుంటే , స్థానిక ఎమ్మెల్యే మాత్రం ఇంట్లో కూర్చొని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. హెచ్ఎండీఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు.విజిలెన్స్‌కు కూడా ఫిర్యాదులు చేస్తున్నారు. దీని వల్ల పనిచేయాల్సిన అధికారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. బైపాస్ రోడ్డు అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యేకు నిజంగా 80 అడుగుల రోడ్డు అవసరమని భావిస్తే, ప్రజల మధ్యకు రావాలని, బైపాస్ రోడ్ లో ప్రజల వద్దకు వచ్చి కూల్చివేతలపై స్పష్టంగా మాట్లాడాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఆస్తి నష్టం కలిగించడం కాకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రహదారి విస్తరణ చేపట్టడం తన ఉద్దేశ్యం అన్నారు.